# కథ

## పరమ సత్యం

ఆ వినాయకుడి కోవెల దగ్గరికి వెళ్ళినప్పుడల్లా ఆ వ్యక్తి గుర్తుకొస్తాడు.

ఆయన నిజంగా మానవుడా లేక నాకు జ్ఞానోదయం కల్గించడానికి ఆ మారేడు చెట్టుకింద తిష్ట వేసుకు కూర్చున్న మహనీయుడా — ఊహించవలసింది మీరే.

ఏడు పదులు దాటి ఉంటాయేమో... నీరుకావి ధోవతి, భుజం మీద చిన్న తుండు... నుదుట విభూతి రేకలు... కొనదేరిన ముక్కు... దొప్ప చెవులు... ఎటో శూన్యంలోకి చూస్తున్నట్లు కూర్చొనుంటాడు.

ఒకప్పుడు కాస్తో కూస్తో గొప్పగా బతికినట్లు కనిపించే ఆయనకిప్పుడు నా అనే వారెవరూ లేరా? లేక ఉండీ, ఆయన్ని వృద్ధాప్యంలో అలక్ష్యం చేశారా?

అసలెప్పుడూ నోరు మెదపడేం?

మూగా?

నేనా గుడిలోకి ప్రవేశించే ముందు నా చెప్పులను ఆయనకు కనిపించేలా ఓ చిన్న తూము పక్కన వదలడం మామూలు. ఆయన ఓరకంట ఓసారి అలా చూస్తాడంతే.

నేను తిరిగొచ్చి చెప్పులు తొడుక్కున్నాక ఆయన చేతికి పది పైసలో, ఇరవై పైసలో ఏదో నాణేన్ని అందిస్తాను.

మళ్ళీ ఆయన దృష్టి ఎటో శూన్యంలోకి పోతుంది.

కొంతకాలంగా ఇది మామూలు

చిటపట చినుకులు పడుతూండడం వల్ల ఆ రోజు చెప్పుల్లేకుండానే గుడి కొచ్చాను. చెట్టుకింద ఆ ముసలాయన తల తుడుచుకుంటున్న వాడల్లా నన్ను ఆపాదమస్తకం పరిశీలించాడు.

నేను స్వామిని సేవించి తిరిగొస్తున్నప్పుడు కూడా ఆయన నా పాదాల వంక క్రీగంట చూస్తున్నాడు.

ఆయనలా వర్షంలో తడుస్తూ కూర్చోవడం కన్నా పక్కనెక్కడైనా కాస్సేపు తల దాచుకోవచ్చు కదా అనిపించింది. ఆ విషయమే ఆయనతో చెప్పాలనుకున్నా. కాని, ఆయన దగ్గరగా వెళ్ళాక అలా చెప్పడానికి మనస్కరించలేదు.

చెప్తే ఏమనుకుంటాడో...!

జేబులోంచి ఇరవై పైసల నాణేన్ని తీసి ఇచ్చాను.

ఆయన ముఖం ప్రకాశవంతమైంది. రెండు చేతులెత్తి "శతమానం భవంతి..." అంటూ అరమోడ్పు కనులతో ఆశీర్వదించాడు.



LINTAS MIL PCNO 5 1210 TL

### చిట్కాలు

* కడుపుబ్బరంగా వుంటే వాము లేదా శొంఠిని నీళ్ళలో బాగా నానబెట్టి తాగితే తగ్గిపోతుంది.

* లో బి.పి. (అల్ప రక్తపోటు) ఉన్నవారు రోజూ మూడుసార్లు దశమూలారిష్ట, అశ్వగంధారిష్టలను స్పూను చొప్పున తీసుకోవాలి.

\- ఉషాలక్ష్మి



అవాక్కయి పోయాను.

అదే తొలిసారి ఆయన కంఠం వినడం.

ఎంతో కాలంగా నేనాయనకు డబ్బేదో ఇస్తున్నాను. ఎన్నడూ లేనిది ఈ వేళ ఆయన పెదవి విప్పి మనసారా ఆశీర్వదించడమేమిటి?

ఆ విషయమే ఆయన్ని అడక్కుండా ఉండలేక పోయాను.

ఆయన బోసినవ్వుతో "విశేషం కాక మరేమిటి నాయనా! ఇంతకాలం నీ చెప్పులను కనిపెట్టినందుకు తృణమో పణమో ఇచ్చేవాడివి. ఈ రోజు చెప్పుల్లేకుండా వచ్చావు. అయినా నాకీ డబ్బు ఇచ్చావు. నిజంగా నువ్వు ధర్మం చేసింది ఈ రోజే కదా నాయనా?" అన్నాడు.

ఎవరోసాచి లెంపకాయ వేసినట్లయింది నాకు.

ఉన్నట్టుండి ఆకాశం తళుక్కుమంది.

వెంటనే భూమి దద్దరిల్లేలా ధ్వని.

నిజంగా ఆయన పల్కుల్లో ఎంత సత్యముంది!

చేతులు జోడించి, ఆయనకు నమస్కరించాను.

అంతకంతకు వర్షం ఎక్కువవుతోంది.

ఆయన గుడిలోకి వెళ్ళాడు. నేను ఇంటి ముఖం పట్టాను.

వర్షానికి గాలి తోడైంది. మర్నాటి వరకు వాతావరణం అలాగే వుంది.

ఉదయం గుడికెళ్ళిన వాడ్ని స్థాణువడి పోయాను.

అక్కడ మారేడు చెట్టు పడి పోయి ఉంది. క్రితం రోజు నాకు ఒక మహత్తరమైన సత్యాన్ని చెప్పిన ఆ వ్యక్తి ఆ ఛాయల్లో కనిపించలేదు.

ఆనాటి నుంచి ఈనాటి వరకు ఆయన కనిపించలేదంటే నమ్మండి!

— జి.వి.జి.



10-1-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక